# నీతి ఒకజాతికే పరిమితమా?

రచన : శ్రీమతి ఎన్. పద్మావతి.

(గత సంచిక తరువాయి)

షీలా మాటలు ఎప్పుడు మాట్లాడినా వింతగా అదో రకంగా ఇష్టంగా ఉంటాయి వినడానికి. ఇంతలో టీ కప్పులతో మేరీ వచ్చింది. "ఏంటమ్మా అంటున్నారు" అంది టీపాయి మీద కప్పులుంచుతూ. "మమ్మీ నువ్వు నాలాగ ఏంకాదు, బాగామాట్లాడుతున్నావంట. అంటోంది మిత్ర" అంది షీలా.

"అవునమ్మా నాకు మీ తెలుగు ఫ్రెండ్సు ఎక్కువ చిన్నటి నుండే అందుచేత నాకు తెలుగుబాగా వచ్చింది. షీలాకి వాళ్ళ డాడీ లాగానే బాగా మాట్లాడటం రాదు" అన్నారు మేరీ కొంచెంసేపు మాటలు అయ్యాక చీకటి పడ్తోంది ఇంక వెళ్తాను అంటూ లేచింది మిత్ర, వీధి వరకూవచ్చి "అప్పుడప్పుడు వస్తూండమ్మా" అన్నారు మేరీ.

అలా మొదలైన పరిచయం దిన దిన ప్రవర్ధమాన మౌతూ పెరిగింది. ఎప్పుడైనా ఆదివారం మా యింటికి వచ్చేది. మా యింట్లోనే భోజనం చేసేది. మీ తెలుగు వంటలు బాగుంటాయి నాకెంతో యిష్టం. కాని మా మమ్మీకి రాదు అంటూ ఉండేది. షీలా అంటే మా యింట్లో మా అమ్మ, నాన్న అన్నయ్యకి వాత్సల్యం మా యింట్లో ఒక వ్యక్తిగా కలిసిపోయింది షీలా,

ఇక ఆ సంవత్సరంతో మా చదువు అయిపోతుంది వాన్వెంటులో, ఇక ఏ కాలేజీలోనో చేరాలి, ఫైనల్ ఎగ్జామ్స్. మా యింట్లో బాగుంటుంది. చదువు కుందాం అంటూ తీసికెళ్ళేది, రాత్రిళ్ళు వాళ్ళింట్లోనే పడుకుని చదువుకునే వాళ్ళం. చెప్పటం మరిచేను షీలా నాన్న జోసప్ గారు షిప్ యింజనీరు, ఆయన ఎప్పుడూ ఇంట్లో ఉండేవారు కారు. షిప్ పైటూరు వెళుతూ ఏ ఆర్నెల్లకో, మూడు నెల్లకో ఓసారి వస్తూంటే వారు వచ్చినపుడు ఎన్నో వస్తువులు, బట్టలు షీలా కోసం తెస్తూండే వారు. వాటిలో ఏదన్నా బాగున్నాయి, అంటే తీసుకోమనేది షీలా, ఎగ్జామ్స్ సంతృప్తికరంగానే వ్రాశాము. రిజల్టుకోసం ఎదురు చూస్తున్నాము.

ఆరోజు ఉదయమే వచ్చింది షీలా. మిత్ర అప్పుడే లేచి కాఫీ త్రాగుతోంది.

"కమాన్, కమాన్, ఏమిటి విశేషం, ఇంత ఉదయాన్నే" అంది గబగబా ఎదురు వెళ్తూ మిత్ర.

"డాడీ, రాత్రివచ్చేరు" అంది షీలా.

"ఆ, ఆహా అయితే!" అందితను.

"ఆ ఆయనతో విలియమ్స్" అని ఆగి, "నువ్వు నాతోరా మాట్లాడాలి. అలా వెళ్దాం" అంది.

"అలాగే లే వస్తాను, అసలు సంగతేమిటి?" అంది మిత్ర.

"తర్వాత చెప్తాగా. త్వరగారా" అంటూ తొందర చేసింది షీలా.

"అలాగే వస్తానులే' అని వంటయింట్లోకి వెళ్ళింది.

వంటయింట్లో పనిచేసుకుంటున్న తల్లితో_

"అమ్మా షీలా వచ్చింది. నన్ను తనతో రమ్మంటోంది వెళ్ళేదా?" అంది.

"అలాగే వెళ్దూగానిలే, కాని ఎందుకు, ముందు కాఫీ ఇయ్యి అంటూ ఫ్లాస్కులోని కాఫీ గ్లాసులోనికి వంచి యిచ్చేరు రుక్మిణమ్మగారు.

కాఫీగ్లాసు అందిస్తూ "ముందు కాఫీత్రాగుతూండు, తయారయి వస్తాను" అంటూ బట్టలు తీసుకుని బాత్రుం వైపు నడిచింది మిత్ర.

కాఫీ త్రాగుతుండగా రుక్మిణమ్మగారు వచ్చి "ఏమ్మా బాగున్నావా? ఈ మధ్య రావడం లేదేం. ఇప్పుడు ఎక్కడకమ్మా మీప్రయాణం" అన్నారు నవ్వుతూ.

"లేదు ఆంటీ మా యింటికే వెల్తాం. డాడీ రాత్రి వచ్చేరు మరేంలేదు ఊరికనే" అంది షీలా.

ఇంతలో ఎర్రంచు పసుపచ్చటి పట్టు పరికిణి, ఎర్ర వోణీ, పసుపచ్చటి జర్సీజాకట్ తో ముస్తాబయి వచ్చింది "పద వెల్దాం" అంటూ మిత్ర.

"అమ్మా! వెళ్లొస్తాం" అంటూ బయలు దేరారు.

"సరే వేగంగా రా!" అంటూ వీధి గుమ్మం వరకు వచ్చేరు రుక్మిణమ్మగారు.

పింక్ కలర్ దుస్తుల్లో బాబ్డ్ హెయిర్ భుజాలమీద నుంచి ముఖం మీద పడుతు తొంగి చూసే గులాబీ పువ్వులా ఉంది షీరా.

ఏం? ఇంత అర్జంటుగా తీసుకెళ్తున్నావే విశేషమా అంది షీలావైపు చూస్తూ

"విశేషం అంటే? ఉంటే డాడీతో విలియమ్స్ వచ్చాడని చెప్పానుగా అతను..." అని సిగ్గుతో ముఖం ఎర్రబడగా తలదించుకుంది.

"అంటే?" అంది అయోమయంగా మిత్రముందు. తరువాత వెంటనే తళుక్కున ఆలోచన మెరిసింది.

"అయితే మేరేజ్ సేస్తారా? అతనువచ్చారా? అంది మిత్ర.

"అవును, అలాగే అనుకుంటున్నారు మమ్మీ, డాడీ నిన్నసాయంత్రం డాడీతో వచ్చేడు. ఇపుడు ఇక్కడే ఉన్నాడు. ఉదయమే ఈ ఊర్లో వాళ్ళవాళ్ళెవరో ఉన్నారని అతను అటువెళితే నేను ఇటు నీ కోసం వచ్చేము".

"కానీ, మిత్రా! అపుడే మేరేజ్ అంటే ఏమిటో ఇదిగా ఉంది. కాలేజ్‌లో చేరతాను ఇంకా చదువు వాలని ఉంది అంటే, ఇంత మంచి మేచ్ కుదరడం కష్టమంటున్నారు డాడీ" అంది దిగులుగా.

"ఇంతకీ, అతను ఏంచేస్తున్నాడట. బాగున్నాడా? నీకు నచ్చాడా" అంది మిత్ర.

"ఆ, బాగానే ఉన్నాడు. డాడీకి బాగా తెలుసు. అతను కూడా షిప్ ఇంజనీరుట. మంచి ప్రొఫెషన్ ఉంటుంది. పారెన్‌లా సెటిలే అవుతాడట. నిన్న నన్ను చూసేడు. ఈ నెలాఖరుకి వెళ్ళి పోవాలిట అందుకని మేరేజ్ చేసుకుని వెళ్ళిపోతాను" అన్నాడుట.

"అంటే, కూడా!" అంది కొంటెగా కన్ను గీటుతూ మిత్ర.

"ఆ, అందుకనే ఈ తొందరట. వాళ్ళ నుదరకి వాళ్ళకి కేబుల్ పంపారు వాళ్ళు కల్కటాలో ఉంటున్నారు. రేపో, ఎల్లుండో వస్తారు. బహుశా అపుడే




# Santhi Diamonds

Prop : B: K. N. Kannan & B K. Rajaram

37, Big Sowrastra Street,

TIRUCHIRAPALLI - 620 008.

★

మేము అత్యుత్తమమైన ఒరిలీన్ స్టార్ డబుల్ కటింగ్,

సాంతిస్టార్ కమలములు మీ నగలకు అతి ప్రకాశాన్నిచ్చేరీతిగా

తయారిస్తున్నాము.

రసాయనిక వజ్రాలను తయారించుటలో

మాదొక ప్రత్యేకత.

సెటిల్ చేస్తారు ఏమిటో అనెక్స్‌పెక్టెడ్‌గా ఈ మేరేజ్ అదీ ఏదో భయంగా ఉంది" అంది షిలా దిగులుగా.

"సిల్లీ, భయమేమిటి? అదే అలవాటవుతుంది. ఇంతకీ నీకు నచ్చాడా?" అంది కొంటెగా.

ఏం మాట్లాడలేదు షిలా సిగ్గుపడుతూ ఉండి పోయింది.

"ఏం నచ్చలేదా?" అంది మిత్ర జవాబు చెప్పించాలన్నట్లు" అయితే మౌనం.

"అంగీకారమే అన్నమాట. అయితే నచ్చాడనుకో వచ్చునా!?" అంది రెట్టిస్తూ,

"అందుకేగా నీకు ఇన్ని చెప్తున్నది" అంది చిరు కోపంగా "బుగ్గల్లో గులాబీలు పూయే" అంటూ చటక్కున ముద్దుపెట్టుకుంది మిత్ర.

"ఛి, పో..." అంటూ ముందుకి గబగబా నడిచింది షిలా. వెనకనే నవ్వుతూ మిత్ర అనుసరించింది.

ఇంటిగేటు తెరచి లోపలకి ప్రవేశించారు. హాల్లో కుర్చీలో కూర్చుని పేపరు చూస్తున్నారు జోసఫ్ గారు.

అలికిడివిని తలెత్తిచూసి "ఏమ్మా, బాగున్నావా మిత్రా" అంటూ మేరా టీ తీసుకురా, మిత్రాకి, కూర్చోమ్మా అన్నారు.

"ఆఁ మిత్రా మీ రిజల్ట్స్ ఎప్పుడు వస్తాయి? క్లాసొస్తుందా" అనిఅడిగారు. "ఆఁ భాగానే రాశాము అంకుల్, బహుశా ఈ వీక్‌లో రావాలి రిజల్ట్స్" అంది మిత్ర.

"రా, మిత్రా డాడీ చీరలు తెచ్చారు చూద్దుగాని" అంటూ లోనికి తీసికెళ్ళింది షిలా.

నాలుగు చీరలు లైట్ కలర్స్‌లో చేతిలో పట్టుకుంటే ఇమిడిపోతూఉన్నాయి. అదేం ఈ సారి అన్నీ చీరలే తెచ్చారు. అంది మిత్ర చీరలు పట్టుకుని చూస్తూ. ఎపుడు తెచ్చినా రకరకాల పేషన్స్ గౌన్లు స్కర్ట్స్ బ్లౌజులు తెస్తారు అందుకని.

"విలియమ్స్‌కి చీరలు కడ్తేనే ఇష్టమట. అందుకని డాడీ చీరలు తీసుకున్నారు. సెలక్షన్ విలియమ్స్‌దేనట" అంది సిగ్గుపడుతూ.

"ఆహా, అలాగా" అంది నవ్వుతూ కొంటెగా మిత్ర.

కలకత్తా నుండి విలియమ్స్ తల్లి తండ్రులు రావడం, షిలా వారికి నచ్చడంతో వారం రోజులు వ్యవధిలో పెళ్ళి నిశ్చయించేసేరు.

పెళ్ళి చర్చిలో వాళ్ళ పద్ధతిలో జరిగినా, ఇంటి దగ్గర రిసెప్షను ఇచ్చారు నాన్నగారు, అన్నయ్య వచ్చారు. షిలా భర్తతో వెళ్ళిపోతూ నన్ను కౌగలించుకుని ఏడ్చింది. "మిత్రా మళ్ళా ఎప్పుడో నిన్ను చూడటం, అసలు చూస్తానో లేదో" అంటూ.

"ఛీ! అదేంలేదు నువ్వు ఇక్కడకి వచ్చినప్పుడల్లా మనం కలుసుకోవచ్చు లెటర్స్‌రాయి మర్చిపోకేం" అంటూంటే నాగొంతు వణికింది. కళ్ళునీళ్ళతో నిండేయి అలా దూరమైంది షిలా.

షిలా వెళ్ళిన పదిరోజులకి కలకత్తానుండి ఉత్తరం రాసింది. వారం పదిరోజులలో అమెరికా వెళ్ళిపోతున్నామని, పాస్‌పోర్టు వ్యగైరాలు వచ్చాయని. అక్కడకి రావడం వీలవదు కాబట్టి డాడీ మమ్మీ ఇక్కడికే వచ్చారు. నన్ను ప్లెయిన్ ఎక్కించే వరకు ఉంటారు. నేను ఒక్కర్తినే కనుక వాళ్ళకి, మిమ్మల్నందర్నీ వదిలి దేశం కాని దేశం వెళ్ళాలంటే నాకూ బాధగానే ఉంది. మిమ్మల్ని మళ్ళీ చూడగలనో లేదో, నీఫోటో మాత్రం పంపు లెటర్స్‌రాయి. అవిచూస్తే నిన్ను చూసినట్లే ఉంటుంది. నా ఫోటో పంపుతున్నాను. వెళ్ళాక ఉత్తరం రాస్తాను" అని రాసింది.

అంతే తరువాత చాలాకాలం వరకు ఉత్తరం లేదు. నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ కావడంతో ఆ ఊరునుండే వెళ్ళిపోయాం. ఆ తరువాత ఆర్నెల్లలో నాకు శ్రీకాంత్‌తో వివాహం కావడం ఈ ఊరు రావడం జరిగి పోయింది. షిలా సంగతులేవీ తెలియలేదు.

(సశేషం)

